టీడీపీ తొలి జాబితాలో ఇద్దరికి చాన్స్



- నర్సీపట్నం నుంచి అయ్యన్నపాత్రుడు
- పాయకరావుపేటకు వంగలపూడి అనిత

- పొత్తులో భాగంగా అనకాపల్లి సీటు జనసేనకు కేటాయింపు
- కొణతాల రామకృష్ణను అభ్యర్థిగా ప్రకటించిన పవన్‌కల్యాణ్

అనకాపల్లి/నర్సీపట్నం/పాయకరావు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి):
అనకాపల్లి జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాలకు తెలుగుదేశం పార్టీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులు ఖరారయ్యారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు (ఆరు పూర్తిగా, ఒకటి (పెందుర్తి)పాక్షికంగా) ఉండగా, అనకాపల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట అసెంబ్లీ స్థానాలకు శనివారం అభ్యర్థులను ప్రకటించారు. నర్సీపట్నం అభ్యర్థిగా మాజీ మంత్రి, సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు, పాయకరావుపేట (ఎస్సీ) స్థానానికి తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, అనకాపల్లి స్థానానికి జనసేన అభ్యర్థిగా మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పేర్లు ఖరారయ్యాయి. జిల్లాలో చోడవరం, ఎలమంచిలి, మాడుగుల, పెందుర్తి స్థానాలకు టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

పదోసారి అసెంబ్లీ ఎన్నికల బరిలోకి అయ్యన్న



అయ్యన్నపాత్రుడు

అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం నుంచి చింతకాయల అయ్యన్నపాత్రుడు మరోమారు ఎన్నికల బరిలో దిగనున్నారు. ఆయన ఇప్పటివరకు తొమ్మిదిసార్లు అసెంబ్లీకి, ఒకసారి అనకాపల్లి నుంచి పార్లమెంటుకు పోటీ చేశారు. పదోసారి నర్సీపట్నం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. అయ్యన్నపాత్రుడు 1983లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి సమీప కాంగ్రెస్ అభ్యర్థి రాజసాగి రామచంద్రరాజుపై గెలుపొందారు. ఆ తరువాత 1985, 1989, 1994, 1999, 2004, 2009, 2014, 2019 ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేశారు వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేశ్ చేతిలో ఓటమి చెందారు. ఆరుసార్లు గెలుపొందారు. ఎన్టీఆర్ క్యాబినెట్‌లో 29 ఏళ్ల వయస్సులో మంత్రిగా పనిచేసే అవకాశం అయ్యన్నకు దక్కింది. 1985-87లో సాంకేతిక విద్యా శాఖ మంత్రిగా, 1994-96 ఆర్ అండ్ బీ మంత్రిగా, 1999 నుంచి 2004 వరకు అటవీశాఖా మంత్రి, 2014-17 పంచాయతీరాజ్ శాఖా మంత్రిగా, 2017-19 వరకు ఆర్ అండ్ బీ మంత్రిగా పనిచేశారు. 1996లో అనకాపల్లి ఎంపీగా ఉన్న పెతకంశెట్టి అప్పలనరసింహం మృతిచెందడంతో జరిగిన ఉప ఎన్నికల్లో అయ్యన్నపాత్రుడు పోటీ చేసి విజయం సాధించారు.

పేట నుంచి అనిత



వంగలపూడి అనిత

పాయకరావుపేట నియోజకవర్గ అభ్యర్థిగా వంగలపూడి అనితను టీడీపీ అధిష్ఠానం ప్రకటించింది. ఆమె మొదటి సారి 2014 ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2019లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తరువాత ఆమెను పాయకరావుపేట ఇన్‌చార్జిగా అధిష్ఠానం నియమించడంతో అప్పటి నుంచి పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా కూడా ఉన్నారు.

టీడీపీకి, ప్రజలకు రుణపడి ఉంటా..

టీడీపీకి, పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటా. టీడీపీ, జనసేన శ్రేణులను సమన్వయపరచుకుని అందరి సహకారంతో విజయం సాధించి చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు బహుమతిగా ఇస్తా. పాయకరావుపేట నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు పూర్తిచేస్తా.

- **వంగలపూడి అనిత**, పాయకరావుపేట టీడీపీ అభ్యర్థి

పీలాకు టీడీపీ అధిష్ఠానం నుంచి పిలుపు

అనకాపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి అసెంబ్లీ స్థానాన్ని జనసేన తరఫున మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు కేటాయించడంతో ఆ సీటుపై ఆశ పెట్టుకున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మనస్తాపానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో పీలా గోవిందకు టీడీపీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చినట్టు సమాచారం. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడలో చంద్రబాబుతో పీలా గోవింద భేటీ కానున్నట్టు పార్టీ వర్గీయులు చెబుతున్నారు.

అనకాపల్లి జనసేన అభ్యర్థిగా కొణతాల



కొణతాల రామకృష్ణ

అనకాపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు జనసేన పార్టీ అనకాపల్లి అసెంబ్లీ స్థానం కేటాయించింది. కొణతాలకు అభ్యర్థిత్వం ఖరారు కావడంతో ఆయన వర్గీయులు శనివారం అనకాపల్లి నెహ్రూచౌక్‌లో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. గవర సామాజిక వర్గానికి చెందిన కొణతాల రామకృష్ణ 1989 నుంచి 1996 వరకు అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడిగా పనిచేశారు. 1991-96 మధ్య ఏపీ పార్లమెంటు సభ్యుల కన్వీనర్‌గా పనిచేశారు. 1999లో అనకాపల్లి అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓటమి పాలైన కొణతాల...2004 ఎన్నికల్లో గెలిచి అప్పటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, న్యాయ తదితర శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2009 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి మరోసారి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం వైఎస్‌ఆర్ సీపీలో చేరారు. పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. 2014 ఎన్నికల అనంతరం కొణతాల వైఎస్‌ఆర్‌సీపీకి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ ఉత్తరాంధ్ర సమస్యలపై సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. జనవరి 17న హైదరాబాద్‌లో పవన్‌కల్యాణ్‌తో భేటీ అయ్యారు. ఆ తరువాత విజయవాడలో జనసేన సభ్యత్వాన్ని తీసుకున్నారు.

విశాఖ జిల్లాలో ఇద్దరి పేర్లు ప్రకటన

'తూర్పు' నుంచి వెలగపూడి, 'పశ్చిమ' నుంచి గణబాబు...మరోసారి పోటీ

- మరో 5 సీట్లు పెండింగ్



వెలగపూడి రామకృష్ణబాబు



పెతకంశెట్టి గణబాబు

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి):
తెలుగుదేశం శనివారం విడుదల చేసిన తొలి జాబితాలో జిల్లా నుంచి ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మాత్రమే అవకాశం దక్కింది. విశాఖ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వెలగపూడి రామకృష్ణబాబు, పెతకంశెట్టి గణబాబులకు టికెట్లు కేటాయించారు. తొలి జాబితాలో సీట్లు దక్కించుకున్న వెలగపూడి రామకృష్ణబాబు, పెతకంశెట్టి గణబాబు ఇద్దరూ సీనియర్లే. ఒక్కొక్కరు మూడు పర్యాయాలు తెలుగుదేశం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. గణబాబు ఇప్పటివరకూ నాలుగు పర్యాయాలు పోటీ చేయగా తాజాగా ఐదోసారి ఆయనకు టికెట్ లభించింది. విశాఖ తూర్పు నుంచి ఇప్పటివరకు మూడుసార్లు పోటీ చేసి విజయం సాధించిన వెలగపూడి నాలుగోసారి అదే స్థానం నుంచి బరిలో దిగనున్నారు. విశాఖ జిల్లాలో మిగిలిన ఐదు సీట్లకు సంబంధించి టీడీపీ, జనసేన మధ్య ఇంకా స్పష్టత రాకపోవడంతో అభ్యర్థులను ప్రకటించలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

అరకులోయ టీడీపీ అభ్యర్థిగా దొన్నుదొర



సియ్యారి దొన్నుదొర

(ఆంధ్రజ్యోతి- పాడేరు)
మన్యంలో అరకులోయ అసెంబ్లీ స్థానం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా సియ్యారి దొన్నుదొరను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఏజెన్సీలో మరో అసెంబ్లీ స్థానమైన పాడేరు పెండింగ్‌లో పెట్టారు. రెండో జాబితాలో పాడేరు అభ్యర్థిని ప్రకటిస్తారని తెలుస్తున్నది. అరకులోయలో గత నెల 20న నిర్వహించిన తెలుగుదేశం పిలుస్తుంది... రా కదలిరా బహిరంగ సభలోనే టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు.. అరకులోయ అభ్యర్థి దొన్నుదొరే అని ప్రకటించారు. దానిని శనివారం టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన నేపథ్యంలో ఖరారు చేశారు. ఉపాధ్యాయుడిగా పని చేసిన దొన్నుదొర రాజకీయాలపై ఆసక్తితో పదేళ్ల క్రితమే ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లో చేరారు. గతంలో వైసీపీ అరకులోయ సమన్వయకర్తగా పని చేసిన ఆయనకు ఆఖరు నిమిషంలో టికెట్ దక్కకపోవడంతో ఆ పార్టీని వీడారు. 2019లో వైసీపీ రెబల్ అభ్యర్థిగా బరిలో దిగి 20 వేలు పైచిలుకు ఓట్లు సంపాదించి తన సత్తాచాటారు. ఆ తరువాత ఆయన తెలుగుదేశం పార్టీలో చేరడంతో ఆయనను తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించింది. దీంతో టీడీపీ నేతగా గత ఐదేళ్లగా నియోజకవర్గంలోని అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు (ఆరు)మండలాల్లో విస్తృతంగా పర్యటించి పార్టీ బలోపేతానికి, తన వ్యక్తిగత రాజకీయ జీవితానికి గట్టి పునాది వేసుకున్నారు. అలాగే సామాజిక సమీకరణల పరంగాను ఆయన బలమైన కొండదొర సామాజికవర్గం కావడంతో గతేడాదే అరకులోయ అసెంబ్లీ ఇన్‌చార్జిగా తెలుగుదేశం పార్టీ నియమించిన విషయం తెలిసిందే.

నిర్లక్ష్యం తాండవం

పూడుకుపోయిన తాండవ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలు

- రెండేళ్ల క్రితం గేట్లు దెబ్బతిన్నా పట్టించుకోని పాలకులు, అధికారులు
- సాగునీరు అందక రైతులు గగ్గోలు

నాతవరం, ఫిబ్రవరి 24:
తాండవ రిజర్వాయర్ పట్ల పాలకుల నిర్లక్ష్యం ఆయకట్టు రైతులకు శాపంగా మారింది. కుడి, ఎడమ కాలువల్లో రెండేళ్ల నుంచి పూడికతీత పనులు చేపట్టకపోవడంతో పొలాలకు నీరు అందడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అలాగే రిజర్వాయర్ గేట్లు దెబ్బతిని నీరు వృథాగా పోతున్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



లీకేజీల వల్ల వృథాగా పోతున్న సాగునీరు



తాండవ ఎడమ కాలువ పారుపల్లి వారి పాకల దగ్గర గేట్లు పూర్తిగా దెబ్బతిన్న దృశ్యం

నాతవరం మండలంలోని తాండవ రిజర్వాయర్ అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో 52 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. తాండవ కుడి కాలువ 15 కిలోమీటర్లు పొడవు, ఎడమ కాలువ 19 కిలోమీటర్ల పొడవు ఉంది. అయితే రెండేళ్ల నుంచి కుడి, ఎడమ కాలువల్లోని పూడికలను తొలగించడం లేదు. దీంతో ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందడం లేదు. తాండవ మెయిన్ గేట్ల నుంచి రెండేళ్లుగా లీకేజీల వల్ల నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఖరీఫ్ వరి పంట సాగు చేసే రైతులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే తాండవ కుడి, ఎడమ కాలువల్లో చాలా చోట్ల పిల్ల కాలువలకు నీరు పంపే గేట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అధికారులు కొత్తగా గేట్లు ఏర్పాటు చేయకపోవడంతో మెట్టప్రాంత భూములకు సరిగ్గా సాగు నీరు అందడం ... మిగతా 8వ పేజీలో

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

తాండవ కుడి, ఎడమ కాలువల్లో పూడికతీత పనులు చేయడానికి, అలాగే దెబ్బతిన్న గేట్లు బాగు చేయించడానికి రూ.1.3 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాం. నిధులు మంజూరైన వెంటనే పూడికతీత పనులతో పాటు దెబ్బతిన్న గేట్ల స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు చేస్తాం. తాండవ రిజర్వాయర్ మెయిన్‌గేట్ల నుంచి లీకేజీల వల్ల నీరు వృథాగా పోకుండా ఉండేందుకు రూ.10 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

- **అనురాధ**, తాండవ డీఈ

వైసీపీలో ముసలం

ప్రభుత్వ విప్ ధర్మశ్రీకి వర్గ పోరు

- ఆయనకు సీటు ఇస్తే ఓటమి తథ్యం అంటూ జోరుగా ప్రచారం
- పార్టీ అధిష్ఠానానికి, ఐ ప్యాక్ టీమ్‌కు వరుసగా ఫిర్యాదులు



చోడవరం, ఫిబ్రవరి 24:
అసెంబ్లీ సీట్ల కేటాయింపు దగ్గర పడుతున్న కొద్దీ చోడవరం వైసీపీలో ఇంత కాలంగా నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గ విభేదాలు రోజుకో విధంగా బయటపడుతున్నాయి. పార్టీలో ఒక్కొక్కరుగా స్థానిక నాయకులు సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ధర్మశ్రీకి వ్యతిరేకంగా సమావేశాలు నిర్వహించడంతో పాటు, ఆయనకు వ్యతిరేకంగా కరపత్రాలు పంపిణీ చేయడం వంటి చర్యలతో అధికార పార్టీలో సీటు రాజకీయం వేడెక్కింది. రెండు రోజుల క్రితం బుచ్చెయ్యపేట మండలంలో అధికార పార్టీకి చెందిన మాజీ మండల అధ్యక్షుడితో పాటు, ఆ మండలంలోని కొందరు పంచాయతీ సర్పంచులు ప్రభుత్వ విప్ ధర్మశ్రీకి వ్యతిరేకంగా సమావేశం నిర్వహించి, ఆయనకు సీటు ఇవ్వొద్దంటూ బహిరంగంగానే విమర్శలు చేయడం పార్టీలో కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో చోడవరం నియోజకవర్గంలో ఈసారి ధర్మశ్రీకి సీటు ఇస్తే పార్టీ ఓడిపోతుందని, ధర్మశ్రీ, అతని సోదరులు తీరుపై అవినీతి ఆరోపణలు చేస్తూ పార్టీ కార్యకర్తల పేరుతో కరపత్రాలు వెదజల్లడంతో పాటు వాట్సాప్‌లలో జోరుగా షేర్ చేస్తున్నారు. దీంతో వైసీపీలో నెలకొన్న అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమంటున్నాయి. నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీకి వ్యతిరేకంగా ఓ వర్గం చాలాకాలంగా పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదులు పంపుతున్నట్టు తెలిసింది. అలాగే ఆ పార్టీ ఐ ప్యాక్ టీమ్‌కు చాలామంది ఫిర్యాదులు చేసినట్టు సమాచారం.

కార్యకర్తల మనోవేదన పేరిట ఫిర్యాదు

తాజాగా ప్రచారం జరుగుతున్న పార్టీ అధిషానానికి నియోజకవర్గ కార్యకర్తల పేరిట రాసినట్టుగా చెబుతున్న లేఖలో ధర్మశ్రీ, అతని సోదరుడు జయదేవ్, పార్టీ నాయకులు.. సర్పంచులు, ఎంపీటీసీల వద్ద కూడా లంచాలు డిమాండ్ చేసి మరీ ... మిగతా 8వ పేజీలో



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం, చిత్రంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఉన్నారు

మహిళలు మరింత పురోగతి సాధించాలి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ

ప్రతి మహిళా సాధికారిత దిశగా ఎదగాలని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పీఎస్ నరసింహ ఆకాంక్షించారు. ఫెడరేషన్ ఆఫ్ వుమెన్ లాయర్స్ ఆఫ్ ఏపీ, విశాఖపట్నం ఆధ్వర్యంలో గ్రీన్‌పార్క్ హోటల్‌లో 'మహిళా సాధికారిత-రాజ్యాంగ ఆవశ్యకత' అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా న్యాయవాదులు భవిష్యత్తులో మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం జస్టిస్ పీఎస్ నరసింహ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు. - వార్త 7వ పేజీలో..



భక్తులతో రద్దీగా ఉన్న పూడిమడక తీరం



పూడిమడక సముద్ర తీరంలో పూజలు చేస్తున్న మహిళలు

తీరం జనసంద్రం

- ఘనంగా మాఘ పౌర్ణమి జాతర
- పూడిమడక, వాడపాలెం, రేవుపోలవరం, ముత్యాలమ్మపాలెంలో సందడి

మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం పూడిమడక సాగర తీరం భక్తులతో పోటెత్తింది. శుక్రవారం రాత్రి జాగరణతో పాటు జాతర ఘనంగా జరిగింది. శనివారం సాయంత్రం భక్తులు సముద్ర స్నానాలు చేశారు. అలాగే రాంబిల్లి పంచాయతీ శివారు వాడపాలెం సముద్ర తీరంలో కూడా వేలాది మంది భక్తులు మాఘ స్నానాలు ఆచరించారు. ఎస్.రాయవరం మండలంలోని రేవుపోలవరం తీరం భక్తులతో కిటకిటలాడింది. శనివారం వేకువజాము నుంచి సాయంత్రం వరకు సందడిగా కనిపించింది. పరవాడలోని ముత్యాలమ్మపాలెం తీరం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు మాఘ స్నానాలు ఆచరించి మాధవస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. - వార్త 7వ పేజీలో..

మాఘ పౌర్ణమికి పోటెత్తిన భక్తజనం

భక్తులతో కిటకిటలాడుతున్న రేవుపోలవరం సముద్రతీరం



పెంటకోట సముద్ర తీరంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



కిటకిటలాడిన పూడిమడక, రేవుపోలవరం, వాడపాలెం, ముత్యాలమ్మపాలెం తీరాలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పోలీసులు గట్టి బందోబస్తు
- స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 24:
మాఘ పౌర్ణమి పుణ్య స్నానాలు ఆచరించేందుకు పూడిమడక, రేవుపోలవరం, వాడపాలెం, ముత్యాలమ్మపాలెం తీరాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం రాత్రి పూడిమడకలో జాగారంతోపాటు జాతర ఘనంగా జరిగింది. శనివారం ఉదయం భక్తులు సముద్ర స్నానాలు చేసి తీరంలో గల లక్ష్మీ వేణుగోపాల సహిత జగన్నాథస్వామిని దర్శించుకున్నారు. సముద్ర స్నానాలనంతరం కొమ్మదేవర్లు, జంగమ దేవర్లు భక్తులను దీవించారు. ఉదయం 11 గంటల దాటిన తర్వాత ఇసుక వేస్తే రాలని జనం పూడిమడకకు చేరుకొని పుణ్య స్నానాలు చేసి దైవ దర్శనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి జాతర సందర్భంగా పూడిమడక సముద్ర తీరం ఇసుకవేస్తే రాలనంత జనంతో నిండిపోయింది. ఈ ఏడాది తీరంలో భారీగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. సెజ్‌లో గల కర్మాగారాల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు తెల్లవార్లు ఎంజాయ్ చేశారు. తీరంలో మెరైన్ పోలీస్ సిబ్బంది గట్టి నిఘా ఏర్పాటు చేశారు. రెండు పడవల్లో సిబ్బంది సముద్రంలో పహారా కాశారు. తీరంలో పోలీసులు అవుట్‌పోస్ట్ ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు భక్తులకు మైక్ ద్వారా సూచనలిచ్చారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

జనసంద్రంలా వాడపాలెం తీరం

రాంబిల్లి: మాఘపౌర్ణమి జాతర సందర్భంగా శనివారం వాడపాలెం సముద్ర తీరంలో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.



అచ్యుతాపురం : జంగమ దేవర దీవెనలందుకుంటున్న భక్తులు

అనంతరం గంగాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రాంబిల్లి సీఐ కె.లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సముద్రతీరంలో రాంబిల్లి పీహెచ్‌సీ సిబ్బంది వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. కాగా లోవపాలెం, వెంకయ్యపాలెం, వాడనడర్సాపురం, కొత్తపట్నం సముద్రతీరాల్లో భక్తులు మాఘస్నానాలు ఆచరించారు.

కిటకిటలాడిన రేవుపోలవరం తీరం

ఎస్.రాయవరం: మాఘ పౌర్ణమి పురస్కరించుకొని రేవుపోలవరం తీరం శనివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి పక్కనే కొండపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీమాధవస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. స్నానాలు ఆచరించిన తర్వాత బ్రాహ్మణులు, జంగమ దేవర్ల ఆశీస్సులు అందుకున్నారు. సముద్రంలో ప్రమాదకరమైన ప్రదేశాల వద్దకు ప్రజలు వెళ్లకుండా పోలీసులు చర్యలు



రాంబిల్లి: స్నానాలు చేసేందుకు వస్తున్న భక్తులతో కిక్కిసిరిన రోడ్డు

తీసుకున్నారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు లక్ష్మీమాధవస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సముద్రతీరంలో తీర్థం జరిగింది. నర్సీపట్నం డీఎస్పీ వెంకట్రామయ్య తన సిబ్బందితో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దగ్గరుండి చర్యలు తీసుకున్నారు. సత్యసాయి సేవ సంఘంతో పాటు ముసలమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బంగారు చిట్టి భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. తీరంలో సుమారు 60 వేల మంది భక్తులు పుణ్య స్నానాలు చేశారని సీఐ అప్పన్న తెలిపారు.

పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు

పాయకరావుపేట రూరల్: మాఘ పౌర్ణమి సందర్భంగా మండలంలోని పెంటకోట, రాజవరం, వెంకటనగరం, పాల్మన్‌పేట సముద్రతీరాలలో మాఘ పౌర్ణమి పుణ్య స్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటెత్తారు. పాయకరావుపేట, తుని, కోటనందూరు తదితర మండలాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని సముద్ర స్నానాలు ఆచరించారు. పెంటకోటలో సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు అభిమానులు మజ్జిగ పంపిణీ చేశారు.



లక్ష్మీమాధవ స్వామిని దర్శించుకుంటున్న గొల్ల బాబూరావు

ముత్యాలమ్మపాలెం తీరానికి పోటెత్తిన భక్తజనం

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరం భక్తజనంతో పోటెత్తింది. శనివారం మాఘ పౌర్ణమి పురస్కరించుకుని పుణ్య స్నానాలు అనంతరం మాధవస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయితే పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ముత్యాలమ్మపాలెం జంక్షన్ నుంచి తీరానికి వెళ్లే రహదారి భక్తులతో కిక్కిరిసిపోయింది. తీరంలో శుక్రవారం రాత్రి మాధవస్వామి తీర్థం ఘనంగా జరిగింది. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు, ఎంపీటీసీ సభ్యులు అర్లిల్లి దేవి, సూరాడ బంగార్రాజు, ఉత్సవ కమిటీ ప్రతినిధులతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డీఎస్పీ కేవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పరవాడ సీఐ బాల సూర్యారావు సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. జాతరను పురస్కరించుకుని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆర్థిక సాయంతో తీరంలో శనివారం ఏర్పాటు చేసిన అల్పాహారం కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు ప్రారంభించారు. సుమారు ఐదు వేల మంది భక్తులకు అల్పాహారాన్ని స్వీకరించారు.



పరవాడ : ముత్యాలమ్మపాలెం తీరంలో మాఘ స్నానాలు చేస్తున్న భక్తులు

క్రైం... crime news

నాలుగు వాహనాలు ఢీ

- నుజ్జునుజ్జయి
- ముగ్గురికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనాలు

పాయకరావుపేట, ఫిబ్రవరి 24: స్థానిక వై జంక్షన్ వద్ద శనివారం నాలుగు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వాహనాలన్నీ నుజ్జునుజ్జయ్యాయి. ఇందుకు సంబంధించి 108 వాహనం సిబ్బంది శ్రీనివాస్, సంతోష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం స్థానిక వై జంక్షన్ వద్ద సిగ్నల్ పాయింటు దాటిన తరువాత విశాఖ నుంచి విజయవాడ వైపు వెళుతున్న లారీ అదుపుతప్పి ముందు వెళుతున్న ప్రైవేటు బస్సు వెనుక భాగాన్ని ఢీకొట్టడంతో పక్కకు వెళ్లిపోయింది. అయినా లారీ ఆగకుండా ముందు వెళుతున్న మరో కారును కూడా బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందు వెళుతున్న వ్యాన్‌ని ఢీకొట్టింది. నాలుగు వాహనాలకు ఢీకొన్న సంఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు గాయాలు కాగా.. బస్సు వెనుక భాగం దెబ్బతింది. అదేవిధంగా కారు, లారీ ముందుభాగం నుజ్జునుజ్జయ్యాయి. నివాసితులు ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తుని ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు 108 సిబ్బంది తెలిపారు. ప్రమాదంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పది కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

నాతవరం, ఫిబ్రవరి 24: గంజాయిని తరలిస్తున్న ఇద్దర్ని శనివారం పట్టుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. కేరళ రాష్ట్రానికి చెందిన అఖిల్ శివన్, మోహన్‌దాస్‌లు ఒడిశా నుంచి ధారకొండ మీదుగా పది కిలోల గంజాయితో వెళుతుండగా, నాతవరం మండలం డి.యర్రవరం వద్ద పట్టుకున్నామన్నారు. అనంతరం అరెస్టు చేసి, కోర్టుకు తరలించినట్టు చెప్పారు.

నలుగురిపై అట్రాసిటీ కేసు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 24: మరిడిమాంబ జాతరలో కొట్టి కులం పేరుతో దూషించారని శ్రీరామనగర్‌కాలనీకి చెందిన వడ్డాది దుర్గాప్రసాద్ శుక్రవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ పోలీసులు తెలిపారు. శ్రీరామనగర్‌కాలనీకి చెందిన దుర్గాప్రసాద్ అతని స్నేహితుడు శ్రీధర్ కలిసి గురువారం రాత్రి విజయరామరాజుపేటలోని కృష్ణమందిరం వద్ద జరిగిన స్టేజి కార్యక్రమానికి వెళ్లారని తెలిపారు. అక్కడ వీరిద్దరూ డాన్స్ బేబి డాన్స్ కార్యక్రమం చూస్తూ డాన్సులు వేస్తుండగా విజయరామరాజుపేట ప్రాంతానికి చెందిన లచ్చా, మరో ముగ్గురు దుర్గాప్రసాద్, శ్రీధర్‌తో గొడవపడి కొట్టి తనను కులం పేరుతో తిట్టినట్టు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు. కేసును అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి : నలుగురు అరెస్టు

కశింకోట, ఫిబ్రవరి 24 : మండల కేంద్రంలోని శివారు కొబ్బరితోటల్లో పేకాట శిబిరంపై పోలీసులు శనివారం సాయంత్రం దాడి చేశారు. ఎస్ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో చేపట్టిన ఆ దాడుల్లో నలుగురు జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4,750లు నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

మద్యం బాటిళ్లు తరలిస్తున్న ఇద్దరిపై కేసు

కశింకోట, ఫిబ్రవరి 24 : మండలంలోని ఎన్‌జీ.పాలెం, పల్లపు సోమవరం గ్రామాల మీదుగా మద్యం క్వార్టర్ బాటిళ్లు తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుళ్లు సూర్యారావు, మల్లేశ్వరి శనివారం తెలిపారు. ఆయా గ్రామాల్లో మద్యం బెల్టు షాపుల ద్వారా విక్రయించేందుకు 24 మద్యం క్వార్టర్ బాటిళ్లు తీసుకువెళుతున్నారన్నారు. ఎన్‌జీ.పాలెం గ్రామానికి చెందిన పరవాడ అప్పారావు, పల్లపు సోమవరం గ్రామానికి చెందిన రాయుడు సంజీవ్ పట్టుబడ్డారన్నారు. ఈ మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని వారు చెప్పారు.

బొద్దపువానిపాలెంలో...

పరవాడ : మండలంలోని బొద్దపువానిపాలెం గ్రామానికి చెందిన బొండా శ్రీనివాసరావును ఎనిమిది మద్యం బాటిళ్లతో శనివారం రాత్రి పట్టుకున్నట్టు పరవాడ సీఐ బాలసూర్యారావు తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణంలో వీటిని కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా తనిఖీ చేయగా పట్టుబడినట్టు చెప్పారు. ఈ మేరకు శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్టు సీఐ బాలసూర్యారావు తెలిపారు.

ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలెన్సు బృందాలకు శిక్షణ

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 24 : కొద్ది రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ సర్వేలెన్స్ బృందాలకు శనివారం కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హెడ్‌కానిస్టేబుల్స్, ఏఎస్ఐలు, డిప్యూటీ తహసీల్దార్లు, ఫ్లయింగ్‌స్క్వాడ్ , సర్వేలెన్స్ బృందాలకు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జయంతి పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ అప్పలనాయుడు, ఎలక్షన్ సెల్ సీఐ కుమారస్వామి పాల్గొన్నారు.

మహిళలు మరింత పురోగతి సాధించాలి

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా సాధికారిత దిశగా ఎదగాలని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పీఎస్ నరసింహ ఆకాంక్షించారు. దేశంలో తొలి మహిళా న్యాయవాది ఫాతిమా బీబీ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులో తొలి జడ్జిగా పనిచేసిన సంగతిని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ లాయర్స్ ఆఫ్ ఏపీ, విశాఖపట్నం ఆధ్వర్యంలో గ్రీన్‌పార్క్ హోటల్‌లో 'మహిళా సాధికారిత-రాజ్యాంగ ఆవశ్యకత' అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో అడుగుపెట్టిన మహిళలు తమను తాము నిరూపించుకున్నారన్నారు. ఆధునిక యుగంలో స్త్రీలు మరింత పురోగతి సాధించాలని సూచించారు. మహిళా న్యాయవాదులు భవిష్యత్తులో మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ మహిళా సాధికారితపై ఈ తరహా సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మహిళా ఫెడరేషన్ విజయాలతో కూడిన సీడీని ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. అనంతరం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్, హైకోర్టు జడ్జిలు జస్టిస్ బీఎస్ భానుమతి, జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, విశాఖపట్నం జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ రాంబాబు, విశాఖపట్నం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి యు.దుర్గాప్రసాదరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు సీనియర్ న్యాయవాది డి.అరుణకుమారి అధ్యక్షత వహించగా, ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ లాయర్స్ రాష్ట్ర ప్రెసిడెంట్ కొప్పాక అరుణ, వైస్ ప్రెసిడెంట్ డి.మంజులత, ఎన్ఈసీ మెంబర్ పి.హేమామాలిని, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

అనకాపల్లిలో వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న రమేష్

అనకాపల్లిటౌన్, ఫిబ్రవరి 24: అనకాపల్లిలో వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూం శనివారం ప్రారంభమైంది. ఈ షోరూంను గుంపిన రమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కొణతాల రాజేంద్ర, వీఎస్ నూకరాజు, కోరుకొండ బుచ్చిరాజు హాజరయ్యారు. ఎంవీపీ బిల్డర్స్ అండ్ ఎస్టేట్స్ ప్రతినిధి జామి భోజరాజు మొదటి కొనుగోలు చేశారు. విభిన్నమైన జ్యూయలరీ డిజైన్లు, విస్తృతశ్రేణి కలెక్షన్లతో అన్ని రకాల బంగారు ఆభరణాలకు ప్రారంభోత్సవ ఆఫర్‌గా ఫ్లాట్ ఆరు శాతం తరుగు ఇచ్చారు. బంగారం ఎక్సేంజ్‌పై అన్ని రకాల బంగారు ఆభరణాలను పొందవచ్చునని వైశ్యరాజు జ్యూయలర్స్ డైరెక్టర్ వైశ్యరాజు నరేష్‌రాజు తెలియజేశారు. అలాగే సిల్వర్ ఆర్టికల్స్ కొనుగోలుపై కిలోకి రూ.10వేలు తగ్గింపు, ఈ ఆఫర్ తొమ్మిది గ్రాములు పైబడిన బంగారు ఆభరణాలపై వర్తించనున్నారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రారంభోత్సవ ఆఫర్‌ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైశ్యరాజు జ్యూయలర్స్ చైర్మన్ వైశ్యరాజు పాల్గుణరాజు, డైరెక్టర్లు వైశ్యరాజు భద్రగిరిరాజు, వైశ్యరాజు కిరణ్‌కుమార్‌రాజు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు, పాడి వృద్ధిపై దృష్టి

- జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 24: ప్రత్యామ్నాయ పంటల సాగు, పాడి అభివృద్ధిపై రైతులకు సహాయ సహకారాలు అందజేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతూ ధాన్యం సేకరణ ఇప్పటి వరకు 55 శాతం చెల్లించగా మిగిలిన మొత్తాన్ని వేగంగా చెల్లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా మామిడి, జీడిమామిడి పంటలకు అధిక దిగుబడి వచ్చేందుకు అవసరమైన సాగు పద్ధతులను తెలియజేయాలన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ తృణధాన్యాలు ఎక్కువగా సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వేసవిలో పశుగ్రాసం కొరత లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం 'చిరు ధాన్యాలతో వంద రకాల వంటలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

అనకాపల్లి కలెక్టరేట్: వచ్చే నెల మూడో తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. శనివారం పల్స్ పోలియోపై అధికారులతో నిర్వహించిన వెబెక్స్‌లో ఆయన మాట్లాడారు. అధికారుల సమన్వయంతో జిల్లాలో 0-5 సంవత్సరాల వయసు గల పిల్లలకు పోలియో చుక్కలను వేయాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ మాట్లాడుతూ జిల్లాలో 1409 బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. డీపీవో శిరీషారాణి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పెరుగుతున్న జనుము విస్తీర్ణం

- ఏడీఆర్ డాక్టర్ జగన్నాథరావు

అనకాపల్లి అగ్రికల్చర్, ఫిబ్రవరి 24 : జనుము విస్తీర్ణం ఇటీవల కాలంలో గణనీయంగా పెరుగుతోందని, రబీలో జనుము, నువ్వు, మొక్కజొన్నలను రైతులు లాభసాటిగా పండిస్తున్నారని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు అన్నారు. శనివారం పరిశోధనా స్థానంలో జరిగిన జిల్లా వ్యవసాయ సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహించారు. వ్యవసాయ ప్రతినిధి శ్రీధర్ వర్షాభావ పరిస్థితులు పంటల దిగుబడిని బాగా దెబ్బతీస్తున్నాయన్నారు. ఈ ఏడాది రబీ విస్తీర్ణం కూడా తగ్గిందన్నారు. కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.అప్పలస్వామి మాట్లాడుతూ వైఎల్ఎం-66 నువ్వురకం ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడినిస్తూ రైతులకు మంచి ఆదాయాన్నిస్తోందన్నారు. ఉద్యాన శాఖ సహసంచాలకులు ప్రభాకరరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ కేవీ.రమణమూర్తి, డాక్టర్ విశాలాక్షి, డాక్టర్ రామలక్ష్మి, డాక్టర్ ఉమామహేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

నేడు గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 24 : జిల్లాలోని ఆదివారం జరగనున్న గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని జాయింట్ కలెక్టర్ జాహ్నవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్ష జరుగుతుందని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సెల్‌ఫోన్లు, గాడ్జెట్స్, ఎటువంటి యంత్ర పరికరాలు పరీక్షా కేంద్రాలలోకి అనుమతించబడవని స్పష్టం చేశారు. సెల్‌ఫోన్లు, గాడ్జెట్స్, ఇతర యంత్ర పరికరాలు పరీక్షా కేంద్రాల వెలుపల భద్రపరుచుకోవాల్సిందిగా ఆమె సూచించారు.

విమ్స్‌లో అంకాలజీ, న్యూరాలజీ సేవలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో కేన్సర్, బ్రెయిన్ స్ట్రోక్ విభాగాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ రెండు విభాగాలను శనివారం ఉదయం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా మెడికల్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ, న్యూరాలజీ విభాగాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కేన్సర్ రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు సర్జికల్ అంకాలజీకి ఇద్దరు, మెడికల్ అంకాలజీకి ఇద్దరు వైద్యులను నియమించామన్నారు. అధిక ఒత్తిడి కారణంగా బ్రెయిన్ స్ట్రోక్ బారినపడిన రోగులకు రూ.50 వేలు విలువజేసే ఇంజెక్షన్‌ను ఉచితంగా ఇవ్వనున్నట్టు డైరెక్టర్ తెలిపారు. స్ట్రోక్ వచ్చిన మూడు నుంచి నాలుగు గంటల వ్యవధిలో ఈ ఇంజెక్షన్ తీసుకుంటే వేగంగా కోలుకుంటారని ఆయన స్పష్టం చేశారు. త్వరలో ఆస్పత్రిలో మరిన్ని విభాగాలను ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు.

భక్తుడిని రక్షించిన మత్స్యకారులు


ప్రాణాలతో బయటపడిన సింహాద్రినాయుడు

పరవాడ, ఫిబ్రవరి 24: మాధవస్వామి జాతర సందర్భంగా ముత్యాలమ్మపాలెం తీరంలో శనివారం పవిత్ర స్నానం చేస్తున్న భక్తుడు ప్రమాదవశాత్తూ సముద్రంలోకి కొట్టుకుపోయాడు. అక్కడి వారు గమనించి కేకలు వేయడంతో మత్స్యకారులు వెళ్లి ఆ వ్యక్తిని రక్షించి ఒడ్డుకు తీసుకొచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తానాంకి చెందిన పైలా సింహాద్రినాయుడు గ్రామానికి చెందిన కొంతమందితో కలిసి ముత్యాలమ్మపాలెం మాధవస్వామి జాతరకు వచ్చారు. స్నానానికి అని సముద్రంలోకి దిగిన సింహాద్రినాయుడు అలలు ధాటికి లోపలకు కొట్టుకుపోయాడు. ఈ విషయాన్ని గమనించిన అక్కడి వారు పెద్ద కేకలు వేయడంతో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లి ఆ వ్యక్తిని రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చారు. మత్స్యకారులను మండల కో-ఆప్షన్ సభ్యుడు పైలపల్లి అప్పన్న, సూరాడ ముత్యాలరావు, పోలీస్ సిబ్బంది అభినందించారు

ఘనంగా వినాయక మందిరం వార్షికోత్సవం


వినాయకుడుని దర్శించుకుంటున్న రత్నాకర్

కొత్తూరు, ఫిబ్రవరి 24: స్థానిక శారదానగర్‌లో వెలసిన వినాయక మందిరం 41వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ బాల గణపతిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రతినిధులు రత్నాకర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాల గణపతి సేవా సంఘం సభ్యులు కరణం ఆనంద్, సాంబశివరావు, మోహన్‌రాజు, అప్పారావు, సంతోష్, రాజు, వినాయక, మణి పాల్గొన్నారు.

పైడితల్లి ఆలయానికి 'సుందరపు' విరాళం


ఆలయ కమిటీకి విరాళాన్ని అందజేస్తున్న సుందరపు విజయకుమార్

రాంబిల్లి, ఫిబ్రవరి 24: మండంలోని కొత్తూరు మామిడివాడలో నూతనంగా నిర్మిస్తున్న పైడితల్లి అమ్మవారిని ఆలయ నిర్మాణానికి జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయ కుమార్ శనివారం గ్రామ పెద్దలకు రూ.1లక్ష 25వేల 116 విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సెట్టెం సత్యనారాయణ, నాయకులు కె.ఈశ్వరరావు ఉన్నారు.

దేవీపురంలో ఘనంగా మాఘ పౌర్ణమి వేడుకలు


లలిత అమ్మవారు

సబ్బవరం, ఫిబ్రవరి 24: మండలంలోని దేవీపురంలో మహా మేరునందు గల సహస్రాక్షి రాజరాజేశ్వరి ఆలయంలో మాఘ పౌర్ణమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ, కలశ స్థాపన, అమ్మవారికి వేదమంత్రాలతో పంచామృతాభిషేకాలతో పూజలు నిర్వహించారు. గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భక్తులకు అన్న ప్రసాద సంతర్పణ జరిగింది. కార్యక్రమంలో శ్రీవిద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప రమా, ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ రోడ్డు పనులు పునఃప్రారంభించాలి

కొత్తూరు, ఫిబ్రవరి 24 : అనకాపల్లి పెరుగుబజార్-రైల్వేస్టేషన్ రోడ్డు పనులు పునఃప్రారంభించాలని సిద్ధార్థ సోషల్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం డిమాండ్ చేశారు. శనివారం ఆయన పెరుగుబజార్ రోడ్డులో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. అనంతరం జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ ఏఈ కె.రామమోహనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి విస్తరణ పనులు మధ్యలో నిలిపివేయడం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనిపై ఏఈ స్పందించి అభివృద్ధి కమిటీ అధికారులతో సమీక్ష నిర్వహించి వీలైనంత త్వరగా అభివృద్ధి పనులను పునఃప్రారంభిస్తామని చెప్పినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కృష్ణమోహన్, జోగారావు, నేలపూడి బాలరాజు, గిలకల అప్పారావు, బ్రహ్మానందం, గ్రంధి రామలక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి డస్ట్‌బిన్‌లు పంపిణీ


డస్ట్‌బిన్స్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ గారా ఉషశ్రీ తదితరులు

పాయకరావుపేట, ఫిబ్రవరి 24 : స్వచ్ఛభారత్‌లో భాగంగా శనివారం పట్టణంలో ఇంటింటికి డస్ట్‌బిన్‌లను సర్పంచ్ గారా ఉషాశ్రీ పంపిణీ చేశారు. స్థానిక కంటోన్మెంట్ ఏరియాలో నిర్వహించిన కార్యక్రమంలో వైసీపీ నాయకులు గారా ప్రసాద్, జగతా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి జె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'పేట'లో టీడీపీ, అనకాపల్లిలో జనసేన సంబరాలు


పాయకరావుపేటలో సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ శ్రేణులు


అనకాపల్లి నెహ్రూచౌక్‌లో నినాదాలిస్తున్న జనసేన నేతలు

పాయకరావుపేట, ఫిబ్రవరి 24 : పాయకరావుపేట అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితకు అధిష్ఠానం టిక్కెట్ కేటాయించడంతో పార్టీ శ్రేణులు శనివారం సంబరాలు జరుపుకున్నారు. పట్టణ పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. అనిత గెలుపు ఖాయమని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం బాణసంచా కాల్చారు. మెయిన్‌రోడ్డుపై పార్టీ జెండాలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంది కాశీవిశ్వనాథం, పల్లా విలియంకేరి, చింతకాయల రాంబాబు, మల్లవరపు రమాకుమారి, సూరా సుబ్రహ్మణ్యం, వేములపూడి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అనిత నివాసం వద్ద సంబరాలు

నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గం టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థినిగా మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత పేరు ప్రకటించిన వెంటనే టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. శనివారం ఉదయమే నక్కపల్లి సమీపంలోని ఆమె నివాసానికి నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు చేరుకున్నారు. పాయకరావుపేట ఉమ్మడి అభ్యర్థినిగా అనిత పేరు చంద్రబాబు ప్రకటించగానే టీడీపీ నాయకులు కేరింతలు కొట్టారు. అనిత నివాసం వద్ద సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి అనిత ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆమె గోత్రనామాలతో అర్చకులు పూజలు చేశారు. ఉపమాక వెంకన్న ఆశీస్సులతో మరలా టీడీపీ,జనసేన నాయకులు, కార్యకర్తల సహకారంతో ఎమ్మెల్యేగా గెలుపొందుతానని ఆశాభావం వ్యక్తం చేశారు.


నక్కపల్లి : ఉపమాక ఆలయంలో పూజలు చేస్తున్న అనిత

జనసేన నాయకుల ఆనందోత్సవాలు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ, జనసేన అభ్యర్థిగా మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పేరును ప్రకటించడంతో జనసేన నాయకులు, కొణతాల అభిమానులు సందడి చేశారు. శనివారం సాయంత్రం గవరపాలెం, పట్టణంలోని ముఖ్య కూడళ్లలో బాణసంచా వెలిగించి, మిఠాయిలు పంచారు. పట్టణంలో జనసేన జెండాలతో బైక్ ర్యాలీ కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దూలం గోపి, శ్రీరామదాసు గోవిందరావు, మళ్ల శ్రీను, తాడి రామకృష్ణ, అప్పికొండ గణేష్, గళ్లా కొండలరావు, భరిణికాన రాము, తదితరులు పాల్గొన్నారు.

బాబు వస్తే 20 లక్షల ఉద్యోగాలు

» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్

మునగపాక, ఫిబ్రవరి 24 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు మూడు వేల రూపాయలు నిరుద్యోగి భృతి అందిస్తారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ముందుగా యువత మేలుకో పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు న్యాయం చేస్తానని వైసీపీ నేతలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వారికి తీరని అన్యాయం చేశారన్నారు. యువతను మేల్కొలిపేందుకు ప్రతి నియోజకవర్గంలో యువతా మేలుకో, చంద్రబాబుకే మన మొదటి ఓటు అనే నినాదంతో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు పెంటకోట విజయ్, టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, తెలుగు యువత నాయకులు కర్రి సాయికృష్ణ, గొన్నాబత్తుల శేషు, పతివాడ చిన్నమనాయుడు, మజ్జి రామకృష్ణ, ఉల్లింగల సంతోష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న చింతకాయల విజయ్, పార్టీ నాయకులు

బాల్య వివాహాల నిరోధానికి చర్యలు

» ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ అధికారిణి అనంతలక్ష్మి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 24 : బాల్య వివాహాల నిరోధానికి చర్యలు తీసుకుంటున్నామని ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ అధికారిణి అనంతలక్ష్మి పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో భేటి బచావో భేటి పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పురోహితులు, పాస్టర్స్, ముస్లిం పెద్దలకు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతున్నట్టు సమాచారం ఇచ్చినట్టయితే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. దిశ మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రాములమ్మ మాట్లాడుతూ బాలల హక్కుల ఉల్లంఘన ఎక్కడ జరిగినా తెలియపరిచినట్టయితే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అనంతలక్ష్మి



ఘనంగా రామలింగేశ్వర స్వామి కల్యాణం

ఎలమంచిలి, ఫిబ్రవరి 24: ఎలమంచిలి కొత్తపేటలో శనివారం మాఘపౌర్ణమిని పురస్కరించుకుని రామలింగేశ్వరస్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బండారు సత్య బంగారు శెట్టి కుటుంబీకులు కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, ఏఎంసీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర పాల్గొన్నారు.

43 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 24: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని సీఐ బుచ్చిరాజు తెలిపారు. పూడిమడక శివారులో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నారని అందిన సమాచారం మేరకు దాడిచేయగా 43 మద్యం సీసాలతో గనగళ్ల ముత్యాలును అరెస్టు చేసినట్టు చెప్పారు. ఇందులో 25 టిన్ బీర్లున్నాయని ఆయన తెలిపారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్య సాధనకు కృషి చేయాలి

» ట్రైనీ డీఎస్పీ భవ్య

ఎలమంచిలి, ఫిబ్రవరి 24: విద్యార్థి దశ నుంచే దశ, దిశ నిర్దేశించుకుని లక్ష్య సాధన సాధించేందుకు కృషి చేయాలని ట్రైనీ డీఎస్పీ. డా. బి.భవ్య సూచించారు. శనివారం కొక్కిరాపల్లి డా.బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో బాలికల సంరక్షణపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోక్సో చట్టం గురించి వివరించారు. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు వాటిని ఏవిధంగా అరికట్టాలి, బాల్య వివాహాలు కారణంగా జరుగుతున్న నష్టాల గురించి విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాణిక్యం, అధ్యాపక, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినులకు సూచనలిస్తున్న ట్రైనీ డీఎస్పీ డాక్టర్.భవ్య

ఉత్తరాంధ్ర కబడ్డీ పోటీల విజేత శ్రీకాకుళం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 24: మాఘ పౌర్ణమి సందర్భంగా పూడిమడక బీచ్‌బాయిస్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఉత్తరాంధ్ర కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో విశాఖ, విజయనగరం, అనకాపల్లి, శ్రీకాకుళం జిల్లాల నుంచి 15 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ స్థానం సాధించిన శ్రీకాకుళం జట్టుకి ట్రోఫీతోపాటు రూ.30వేలు నగదుని నిర్వాహకులు బహూకరించారు. రెండో స్థానంలో నిలిచిన బీచ్‌బాయిస్ జట్టుకి రూ.20 వేలు, ఎన్‌వైఎస్ అనకాపల్లి జట్టు తృతీయ స్థానం, చతుర్థ స్థానం సాధించిన అల్లూరి జట్టులకు చెరో రూ. పది వేలు బహుమతులను నిర్వాహకులు అందించారు.


షీల్డ్‌తో శ్రీకాకుళం జట్టు ఆటగాళ్లు

జగనన్నకాలనీ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

కోటవురట్ల, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలో జగనన్న కాలనీ లేఅవుట్లను మండల అధికార యంత్రాంగం శనివారం పరిశీలించింది. మండల ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ ఆధ్వర్యంలో మండల అధికారులు కోటవురట్ల, రాట్నాలపాలెం గ్రామాల్లో జగనన్నకాలనీ లేఅవుట్లను పరిశీలించారు. ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు వేగవంతంచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, మండల ఇంజనీర్ వర్మ, హౌసింగ్ ఏఈ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో సామూహిక హారతులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 24: మునిసిపాలిటీ రామ్‌నగర్ సమీపంలోని టిడ్కో ఇళ్ల కాలనీలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద మహిళలంతా సామూహిక హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మాఘపౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు,భజనలు నిర్వహించారు. అనంతరం సామూహిక హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు ప్రసాద్, హైరామ్, గంగాధర్ పాల్గొన్నారు.

నక్కపల్లిలో నూతన విఘ్నేశ్వర ఆలయం

» నేటి నుంచి 28 వరకూ ప్రారంభోత్సవ కార్యక్రమాలు

నక్కపల్లి, ఫిబ్రవరి 24: నక్కపల్లి హైవేకు ఆనుకుని వీవర్స్ కాలనీలో కొత్తగా నిర్మించిన విఘ్నేశ్వర ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఆదివారం నుంచి 28వ తేదీ వరకూ జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం సాయంత్రం సరస్వతి, భక్త మార్కండేయ, విఘ్నేశ్వర విగ్రహాలతో ఊరేగింపు, శోభాయాత్ర, గణపతి పూజ, అంకురార్పరణ వంటి కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. 26న క్షీరాధివాసం, ఆరాధన, అగ్ని మథనం, జలాదివాసం, 108 కలశలతో విగ్రహాలకు అభిషేకం జరుగుతుందన్నారు.27న వేదపారాయణ, హోమం, 28న విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ తదుపరి భక్తుల దర్శనాలుంటాయని చెప్పారు. 28 మధ్యాహ్నం అన్నదానం వుంటుందని చెప్పారు.


నూతనంగా నిర్మించిన విఘ్నేశ్వర ఆలయం

ఆ టీచర్లను ఎన్నికల విధుల నుంచి మినహాయించండి

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 24: వచ్చే సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి 55 ఏళ్లు నిండిన ఉపాధ్యాయులు, గర్భిణీ, బాలింలు, విభిన్న ప్రతిభావంతులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ శనివారం జిల్లా ఎన్నికల అధికారి దయానిధికి వినతిపత్రం అందజేసినట్టు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, మండల మాజీ అధ్యక్షుడు సింహాచలం పాల్గొన్నారు

నేడు ఉపమాక వెంకన్న పెండ్లి రాటోత్సవం

నక్కపల్లి, ఫిబ్రవరి 24: ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలకు సంబంధించి ఆదివారం ఉదయం 10-14 గంటలకు పెండ్లిరాటోత్సవం జరుగుతుందని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు చెప్పారు. మార్చి 20 నుంచి శ్రీవారి వార్షిక కల్యాణోత్సవాలు జరుగుతాయని, భక్తులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

తీరాల్లో మాఘ పౌర్ణమి పుణ్య స్నానాలు


బోయపాడు తీరంలో పుణ్య స్నానాలాచరిస్తున్న భక్తులు

నక్కపల్లి, ఫిబ్రవరి 24: మండలంలోని రాజయ్యపేట, బోయపాడు తీరాల్లో మాఘపౌర్ణమి పుణ్యస్నానాలు ఆచరించేందుకు శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బోయపాడు తీరంలో తీర్థం జరిగింది. మండలంలోని అనేక గ్రామాలకు చెందిన వారు రాజయ్యపేట, బోయపాడు తీరాలకు వెళ్లి పుణ్యస్నానాలాచరించారు. సూర్యనమస్కారాలు చేసి అర్ఘ్యప్రదానం చేశారు.

వైభవంగా బోయిమాంబ విగ్రహ ప్రతిష్ఠ

పరవాడ, ఫిబ్రవరి 24 : పి.బోనంగి పంచాయతీ పరిధిలోని వీఎల్ఎన్‌పురంలో బోయిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, సర్పంచ్ బండారు కల్పన, మాజీ సర్పంచ్ రాయవరపు దేముడు, స్థానిక నాయకులు అట్టా సన్యాసిఅప్పారావు, బండారు రాజశేఖర్, డెక్క శ్రీనివాసరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

రిటైర్డు న్యాయమూర్తికి సత్కారం


రిటైర్డు న్యాయమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 24 : స్థానిక బార్ అసోసియేషన్ హాల్‌లో రిటైర్డు న్యాయమూర్తి వి.శ్రీరామచంద్రమూర్తి వీడ్కోలు సభ ఘనంగా జరిగింది. శనివారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయి వెంకటలక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు శ్రీవిద్య, గంగరాజు, ప్రదీపా, విజయలక్ష్మి, న్యాయవాదులు పాల్గొని శ్రీరామచంద్రమూర్తిని ఘనంగా సత్కరించారు.

'వస్తువుల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి'

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 24: వస్తువుల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలని లీగల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు వీడీవీఎస్ మూర్తి సూచించారు. స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో వినియోగదారుల హక్కులపై శనివారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఏదైనా వస్తువు కొనుగోలు చేసినప్పుడు ఆ వస్తువు కాలపరిమితి, బ్యాచ్ నంబరు, ప్యాకింగ్ నంబరు తదితర విషయాలను వినియోగదారులు గమనించాలన్నారు. ఎవరైనా వస్తువులు అమ్మేటప్పుడు ఆ వస్తువు కాలపరిమితి దాటి అమ్మినా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. అలాగే కోర్టులో అపీల్ చేయవచ్చునన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కులు గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డి.జీవరత్నం, డాక్టర్ లూసీ, ప్రసాద్ రాజు, ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా రామాలయం కలశ ప్రతిష్ఠ


సీతారామలను దర్శించుకుంటున్న బండారు సత్యనారాయణమూర్తి

సబ్బవరం, ఫిబ్రవరి 24: మండలంలోని పెదయాతపాలెంలో నూతనంగా నిర్మించిన కోదండ సీతారామాలయ కలశ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలశ ప్రతిష్ఠతోపాటు హోమం, అన్నమాచార్య కీర్తనలు, అన్నసంతర్పణ అనంతరం కోలాటం, సాముగరిడీలు, సాయంత్రం దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. వైస్ఎంపీపీ-1 రూస్సీలక్ష్మీరాణి, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, గ్రామ పెద్దలు రాపేటి రాము, వీకేపీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, ఆడారి నాగరాజు పూజల్లో పాల్గొన్నారు.

మాదిగల సమావేశాన్ని జయప్రదం చేయండి

సబ్బవరం, ఫిబ్రవరి 24: అనకాపల్లి రోటరీ క్లబ్‌లో ఆదివారం జరగనున్న మాదిగల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడు దువ్వు మనోహర్ కోరారు. ఈ సందర్భంగా శనివారం పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. ఈ ఆత్మీయ సమావేశానికి ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో బొర్రా జయరాజు, సామ్రాట్‌కుమార్, ఇందుగుబిల్లి కోపి, కోటి, ఈశ్వరరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

శారదానగర్‌లో స్తంభించిన ట్రాఫిక్

» ప్రధాన రోడ్డులో స్టేజీల నిర్మాణంతో అవస్థలు


శారదానగర్‌లో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన వాహన చోదకులు

కొత్తూరు, ఫిబ్రవరి 24 : స్థానిక శారదానగర్‌లో వినాయక మందిరం వార్షికోత్సవం సందర్భంగా ప్రధాన రోడ్డుపై స్టేజీలు నిర్మించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాయంత్రం జరిగే కార్యక్రమాలకు ఉదయం 7 గంటల నుంచే రోడ్డును బ్లాక్ చేయడంతో వాహన చోదకులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాజకీయ ఒత్తిడిలతో రాత్రి వీరికి స్టేజీల నిర్మాణం, ప్రదర్శనలకు అనుమతులు ఇచ్చారు. ఉదయం నుంచి పనులు చేపట్టడంతో ఆ మార్గంలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు విధులకు హాజరు కావాల్సిన ఉద్యోగులు, వారి వాహనాలతో శారదానగర్‌లో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయారు. వాహనచోదకులు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ పైడపునాయుడు సిబ్బందితో వచ్చి సరి చేసి వెళ్లారు. రోజంతా ట్రాఫిక్ సమస్య అందరినీ ఇబ్బందులకు గురి చేసింది.

సిద్ధం సభ ఏర్పాట్లు పరిశీలన

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 24: మండలంలోని అడ్డరోడ్డులో సోమవారం జరగనున్న సిద్ధం సభను ఏర్పాట్లను రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. వారి వెంట బొలిశెట్టి గోవిందరావు ఉన్నారు.

నిర్లక్ష్యం తాండవం

... 5వ పేజీ తరువాయి

లేదు. తాండవ రిజర్వాయర్‌లో నీటిమట్టం తెలిపే పెయింటింగ్ పూర్తిగా పోవడంతో ఎన్ని అడుగుల నీటి నిల్వలు ఉన్నాయో తెలుసుకోవడం కష్టంగా ఉందని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. సుందరీకరణలో భాగంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో డ్యామ్‌పై కడియం నుంచి తెచ్చిన వివిధ రకాల పూల మొక్కలను ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మొక్కలు ఎండిపోయాయి. డ్యామ్‌పై విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో అంధకారంగా ఉంటోంది. డ్యామ్ దిగువన గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసిన పార్కు ఇప్పుడు అధ్వానంగా తయారైంది. కాగా ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని, రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల్లో పూడికలు తొలగించాలని, డ్యామ్‌పై అభివృద్ధి పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వైసీపీలో ముసలం

... 5వ పేజీ తరువాయి

దోపిడీ చేస్తున్నారని, గోవాడ షుగర్స్‌లో కూడా వారి అవినీతి ఎక్కువైందని ఆరోపణలు గుప్పించారు. ఆయనకు మళ్లీ సీటు ఇస్తే పార్టీ ఓడిపోవడం ఖాయమని ఆ ఫిర్యాదులో విజ్ఞప్తి చేయడంతో పాటు వేరే వ్యక్తిని ఇన్‌చార్జిగా నియమించాలంటూ సూచించారు. కాగా ఈ వ్యతిరేక ప్రచారాన్ని ధర్మశ్రీ వర్గీయులు కొట్టిపడేస్తున్నారు. తమ నేతకు సీటు రాకుండా చేసేందుకు తెర వెనుక కొన్ని శక్తులు పని చేస్తున్నాయని, ఎవరెంత చేసినా ఈసారి సీటు ధర్మశ్రీకే ఖాయం అవుతుందంటూ వాదిస్తున్నారు.

పేదలను ఆదుకోవడానికే మినీ మేనిఫెస్టో : బుద్ద

అనకాపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పేదలను ఆదుకోవడానికే మినీ మేనిఫెస్టోలో సూపర్-6 పథకాలను ప్రకటించిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంపికచేసిన ప్రతినిధులకు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ మినీ మేనిఫెస్టోలోని ఆరు పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ పాలనలో దగాపడ్డ నిరుద్యోగుల కోసం 20 లక్షల ఉద్యోగాల కల్పన, ఉద్యోగాలు వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి చెల్లిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ నియమించిన ప్రతినిధులు ఇంటింటి ప్రచారం చేయాలన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బుద్ద జగదీశ్, తదితరులు

గిరులకు భక్తజనహారం

▸▸ నర్సీపట్నం, నాతవరంలో వైభవోపేతంగా గిరిప్రదక్షిణ ▸▸ పెద్ద సంఖ్యలో తరలి రాక


బ్రహ్మలింగేశ్వరస్వామి


నర్సీపట్నంలో బ్రహ్మలింగేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 24 : పట్టణ పరిధిలోని బలిఘట్టంలో కొలువుదీరిన బ్రహ్మలింగేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ శనివారం అత్యంత వైభవోపేతంగా సాగింది. మాఘ పౌర్ణమి సందర్భంగా బలిఘట్టం రాజరాజేశ్వరి సమేత బ్రహ్మలింగేశ్వర స్వామి గిరి ప్రదక్షిణకు మొట్టమొదటి సారిగా శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే గణేశ్ పల్లకి మోశారు. ఆలయం చుట్టూ రెండు కిలోమీటర్లు గిరి ప్రదక్షిణలో వందలాది మంది భక్తులు భాగస్వాములై శివనామాన్ని స్మరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన తీర్థప్రసాదాలను స్వీకరించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. అయ్యన్న యువ సేన ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శెట్టి చిన్న, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆదిలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, వైసీపీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండమ్మ ఆలయం కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

నాతవరంలో నయనానందకరంగా వేడుక

నాతవరం: మండలంలోని తాండవ రిజర్వాయర్ వద్ద గల నల్లగొండమ్మ ఆలయంలో మాఘపౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిప్రదక్షిణ చేపట్టారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు ఆయకట్టు రైతులు విచ్చేసి తొలుత అమ్మవారిని దర్శించుకున్న అనంతరం కొండ చుట్టూ నడకను ఆరంభించారు. జైనల్లగొండమ్మ.., జైశ్రీరామ్.. నినాదాలు చేస్తూ అంతా ముందుకు సాగారు. ఆడాకుల, తాండవగేట్లు, జాలారిపేట గ్రామాల మీదుగా సుమారు 18 కిలోమీటర్లు ఈ ప్రదక్షిణ జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తాగునీరు, మధ్యాహ్న భోజనం వంటి ఏర్పాట్లు చేపట్టారు. రాత్రికి ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


భక్తుల పూజలందుకున్న నల్లగొండమ్మ

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

పోలీసు అధికారులు, న్యాయవాదుల సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి షియాజ్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఫట్టాన్ షియాజ్ ఖాన్

నర్సీపట్నం, ఫిబ్రవరి 24 : వచ్చే నెల తొమ్మిదిన జరిగే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి పట్టాన్ షియాజ్ ఖాన్ అన్నారు. పోలీసు అధికారులు, న్యాయవాదులతో శనివారం ఇక్కడ ఏర్పాటైన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు. దీని వలన విలువైన కాలం, డబ్బు ఆదా అవుతాయన్నారు. జూనియర్ సివిల్ జడ్జి మధుసూదనరావు మాట్లాడుతూ రాజీ పడదగిన కేసుల్లో పోలీస్ అధికారులు, న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డులో దేశ నాయకుల విగ్రహాలు


వివేకానంద విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే తదితరులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 24 : పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పెదబొడ్డేపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు బైపాస్ రోడ్డులో దేశ నాయకుల విగ్రహాలు ఆవిష్కరణ, మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గణేశ్ శనివారం చేపట్టారు. మునిసిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, కమిషనర్ రవిబాబు, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన నాయుడు, ఏకా శివ, పీఆర్‌టీయూ అధ్యక్షుడు డీజీనాథ్‌లతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


కేంద్ర పథకాలతో ఉన్న పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈర్లె శ్రీరామ్మూర్తి

'అసమర్థ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపండి'

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 24 : రాష్ట్రంలో అవినీతి, అసమర్థ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ ఈర్లె శ్రీరామ్మూర్తి పిలుపునిచ్చారు. బుచ్చెయ్యపేటలో శనివారం సాయంత్రం నిర్వహించిన ప్రజాపోరు బహిరంగ సభలో మాట్లాడారు. జిల్లాలో రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉంటే పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. నీటి వనరుల కట్టడాలు శిథిలావస్థకు చేరినా ప్రభుత్వానికి పట్టడం లేదని ఎద్దేవా చేశారు. పెద్దేరు రిజర్వాయర్ కుడి కాలువ ఆధునికీకరణకు నిధులు మంజూరైనట్టు సాక్షాత్తు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చేసిన ప్రకటన ఆరు నెలలుగా కాగితాలకే పరిమితమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫలితంగా బుచ్చెయ్యపేట మండలంలో సుమారు ఆరు వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందక రైతులు పంటలను నష్టపోతున్నారన్నారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ నేడు తిరోగమనంలో పయనిస్తుందని ఆరోపించారు. బీజేపీతో దేశాభివృద్ధి సాధ్యమన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరావు మాట్లాడుతూ జగన్ పాలనపై ప్రజలంతా విసిగిపోయారన్నారు. అనంతరం కేంద్ర పథకాలతో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సభలో పార్టీ నాయకులు రామరాజు, కందర్ప రమణమూర్తి, సీతానాగరాజు, బూత్ కమిటీ అధ్యక్షులు, శక్తి కేంద్రాల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మస్తర్లలో దిద్దుబాటులను సహించం

▸▸ ఉపాధి పనుల సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఏపీడీ

నాతవరం, ఫిబ్రవరి 24 : ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీల్లో పలుచోట్ల మస్తర్లలో దిద్దుబాట్లు ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని డూమా ఏపీడీ ఎం.రోజారాణి అన్నారు. ఇకపై ఇటువంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని వీఆర్‌పీలకు ఆమె హెచ్చరించారు. సామాజిక తనిఖీలపై శనివారం ఆమె ఇక్కడ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 1066 పనులపై సామాజిక తనిఖీలు జరిపినట్టు చెప్పారు. ఇందులో ఏడు వేల రూపాయలు రీకవరీ, రూ.4500 పెనాల్టీ విధించినట్టు తెలిపారు. 2022వ సంవత్సరం ఏప్రిల్ నుంచి ఏడాది పాటు జరిగి పనులపై తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 20 మండలాల్లో సామాజిక తనిఖీల ప్రజావేదిక ఏర్పాటు చేయగా, ఒక్క నాతవరం మండలంలోనే తక్కువగా రీకవరీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీడీవో జె.రాంబాబు, ఎస్ఆర్‌పీ బి.సూర్యనారాయణ, జిల్లా నిఘా అధికారిణి సిహెచ్.నిర్మలాదేవి, వైస్ ఎంపీపీ-2 షైనం నాగ గోపీ, ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు, దేముడు తదితరులు పాల్గొన్నారు.



నాతవరంలో నిర్వహించిన ప్రజా వేదికలో ఏపీడీ రోజారాణి తదితరులు

ఉత్సాహంగా జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పోటీలు


ఎడ్ల పరుగు పోటీలను ప్రారంభిస్తున్న రామానాయుడు

చీడికాడ, ఫిబ్రవరి 24: మండలంలోని అర్జునగిరిలో శనివారం స్వయంభూ లక్ష్మీ నృసింహస్వామి ఆలయం వద్ద తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం జరిగిన జిల్లాస్థాయి ఎడ్లపరుగు పోటీ ల్లో 20 జతలు ఎడ్లు తలపడగా, విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే రామానాయుడు విజేతలను అభినందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నం నాయుడు, కశిరెడ్డి గణపతి, జె.ప్రసాద్, పెంటకోట అమ్మతల్లి నాయుడు, సర్పంచ్ బొడాల ఉమాదేవి తదితరులు పాల్గన్నారు.

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లి ఉమామహేశ్వరీ దేవీ తీర్థం ఘనంగా జరుగుతోంది. ఆదివారం మధ్యాహ్నం జిల్లాస్థాయి ఎడ్ల పొరుగు పోటీలు నిర్వహించనున్నారు.

సంత వేలం రూ.2.77 లక్షలకు ఖరారు


వేలం పాట నిర్వహిస్తున్నఎంపీడీవో

మాకవరపాలెం, ఫిబ్రవరి 24 : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సంతలో ఆశీల వసూలుకు సంబంధించి నిర్వహించిన వేలం పాట రూ.2,77,500లకు ఖరారైనట్టు ఎంపీడీవో జాన్ లింకన్ తెలిపారు. గత ఏడాది రూ.2.63 లక్షలకు వేలం జరిగిందన్నారు. ప్రస్తుతం జరిగిన వేలం పాటకు పన్నెండు మంది హాజరుకాగా, గల్లా సన్యాసి నాయుడు దక్కించుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలంలో భయం.. భయం..!

▸▸ చేతికి అందేంత ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ వైర్లు

▸▸ ఆందోళన చెందుతున్న రైతులు, కూలీలు, పశువులకాపరులు

మాడుగుల, ఫిబ్రవరి 24 : విద్యుత్ వైర్లు పలుచోట్ల భయపెడుతున్నాయి. చేతికి అందేంత ఎత్తులో ఉండడంతో వాటిని చూసినవారు హడలిపోతున్నారు. మాడుగుల నుంచి ఎం.కోడూరు గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గం పక్కన ఉన్న వ్యవసాయ కనెక్షన్‌కు చెందిన వైర్లు చాలా కిందకు వేలాడుతున్నాయి. నిత్యం అటుగా రైతు, కూలీలతో పాటు పశువుల కాపరులు వెళ్లివస్తుంటారు. ఈ వైర్ల కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. గాలులు వీచినప్పుడు, వర్షాల సమయాల్లో మరింత భయం నెలకొంటోంది. విద్యుత్ అధికారులు స్పందించి వైర్లను సరిచేయాలని అంతా కోరుతున్నారు.


కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు

అభివృద్ధి చేసేవారికే పట్టం కట్టండి

▸▸ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఓటు వేయండి

▸▸ 'యువతా మేలుకో... ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్'లో విజయ్ పిలుపు


పోస్టర్లను విడుదల చేస్తున్న చింతకాయల విజయ్, జడ్పీటీసీ రమణమ్మ తదితరులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 24 : రాష్ట్ర ప్రగతి, ప్రజల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని యువతీ యువకులు మొట్ట మొదటి ఓటును వేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పిలుపునిచ్చారు. ఇక్కడి మదర్ నర్సింగ్ కళాశాలలో శనివారం 'యువతా మేలుకో... ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తొలి ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. 1995లో చంద్రబాబు నాయుడు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో డ్వాక్రా సంఘాలను తీసుకు వచ్చారన్నారు. ఈ పథకం వలన మహిళలకు ఎంతో మేలు జరిగినట్టు వివరించారు. తొలి ఓటు మహిళా సాధికారితకు వేయాలన్నారు. అయ్యన్నపాత్రుడు మంత్రిగా ఉన్న సమయంలో నర్సీపట్టణాన్ని విద్యా హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలి టెక్నిక్ కళాశాల, ఐటీఐలను అందుబాటులోకి తెచ్చారన్నారు. నర్సీపట్నం పెద్ద చెరువును ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తే, ఇప్పుడు చెత్తాచెదారం పోసి డంపింగ్ యార్డుగా మార్చేశారని విమర్శించారు. ఉన్న డంపింగ్ యార్డును వినియోగించడం లేదన్నారు. సగం సగం రోడ్లు వేసి హంగామా చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యేను ఉద్దేశించి విమర్శించారు. రాష్ట్రం రూ.12లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని విమర్శించారు. యువత మొట్టమొదటి ఓటు అభివృద్ధి, మహిళా సాధికారత, ఉద్యోగావకాశాలు, మౌళిక సదుపాయాలు కల్పించేవారికి వేయాలని కోరారు. అనంతరం ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, డాక్టర్ మద్దు వెంకటరమణ, టీడీపీ పట్టణ కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'సర్పా'లో ఇసుక తవ్వకాలపై టీడీపీ ఆందోళన


అక్రమ ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని నినాదాలు చేస్తున్న నాయకులు

మాకవరపాలెం, ఫిబ్రవరి 24 : సర్పా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తూ పీపీఅగ్రహారంలోని తూటిపాల జాజిగెడ్డ వద్ద టీడీపీ నాయకులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు మాట్లాడుతూ ప్రతి రోజూ అధికార పార్టీకి చెందిన వారు జంగాలపల్లి, పీపీ అగ్రహారం, బీఎస్‌పేట, మాకవరపాలెంలలో ఉన్న సర్పా నదితో పాటు తూటిపాల జాజిగెడ్డలో భారీ ఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. ఈ కారణంగా నదులకు ఆనుకొని ఉన్న సాగునీటి బోర్లు అడుగంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాగునీటి వనరులు కూడా దెబ్బతింటున్నాయని వారు పేర్కొన్నారు. ఉచితం పేరుతో ఇసుకపై అధికార పార్టీ నాయకులు భారీ దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వారికి ఉచితంగా ఇసుక అందించాలని, ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్టు వేసి సాగునీటి వనరులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అల్లు రామునాయుడు, సర్పంచ్‌లు దుంగల రమణ, మాకవరపాలెం ఉపసర్పంచ్ లాలం రాము, మాజీ సర్పంచ్‌లు కలిగట్ల బాబూరావు, దువ్వాసి వెంకటగిరి, మండల యూత్ అధ్యక్షుడు సురేష్, సీనియర్ టీడీపీ నాయకులు రమణ, జోగిపాత్రుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కేశవస్వామి చక్రస్నానం


పూర్ణాహుతిని నిర్వహిస్తున్న అర్చకులు

చోడవరం, ఫిబ్రవరి 24 : శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ఇక్కడ స్వామివారి చక్రస్నానాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం నారికేళాలు, పాలు, పెరుగు, తేనె, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. అర్చకులు సుదర్శన సీతారామాచార్యులు ఆధ్వర్యంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులతో పాటు పెద్దలు ఉపాధ్యాయుల శ్రీనివాస్, ఉప్పల బాబు తదితరులు పాల్గొన్నారు

'కిసాన్ క్రెడిట్ కార్డులను వినియోగించుకోండి'


మాట్లాడుతున్న వైద్యాధికారి సురేష్

రోలుగుంట, ఫిబ్రవరి 24 : కేంద్ర ప్రభుత్వం జారీ చేసే కిసాన్ క్రెడిట్ కార్డులను రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కుసర్లపూడి పశు వైద్యాధికారి సురేష్ పేర్కొన్నారు. శనివారం జె.నాయుడుపాలెం ఆర్‌బీకే వద్ద పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ కార్డు ద్వారా రూ.1.5లక్షల నుంచి రూ.3లక్షల వరకు రుణ సదుపాయం లభిస్తుందన్నారు. 18 ఏళ్ల నుంచి 75 ఏళ్ల లోపు గల రైతులంతా దీనికి అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తిగల రైతులు ఆధార్‌కార్డు, ఫోటో, పాన్‌కార్డు, హెల్త్‌కార్డు, భూమి పత్రాలు అందుబాటులో ఉండాలన్నారు. ఆసక్తిగల రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర కబడ్డీ పోటీల విజేత శ్రీకాకుళం


షీల్డ్‌తో శ్రీకాకుళం జట్టు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 24: మాఘ పౌర్ణమి సందర్భంగా పూడిమడక బీచ్‌బాయిస్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఉత్తరాంధ్ర కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో విశాఖ, విజయనగరం, అనకాపల్లి, శ్రీకాకుళం జిల్లాల నుంచి 15 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ స్థానం సాధించిన శ్రీకాకుళం జట్టుకి ట్రోఫీతోపాటు రూ.30వేలు నగదుని నిర్వాహకులు బహూకరించారు. రెండో స్థానంలో నిలిచిన బీచ్‌బాయిస్ జట్టుకి రూ.20 వేలు, ఎన్‌వైఎస్ అనకాపల్లి జట్టు తృతీయ స్థానం, చతుర్థ స్థానం సాధించిన అల్లూరి జట్టులకు చెరో రూ. పది వేలు బహుమతులను నిర్వాహకులు అందించారు.

తామరంలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ



మాకవరపాలెం, ఫిబ్రవరి 24 : తామరంలో నిర్మించిన రామాలయంలో శనివారం సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఈ గ్రామంలో రామాలయం ఏర్పాటుకు సుమారు రూ.35 లక్షల నిధులు మంజూరు చేశారు. ఎట్టకేలకు ఆలయం నిర్మాణం పనులు పూర్తి చేశారు. గత వారం రోజులుగా గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కోసూరు శ్రీనివాసరావు, నాగమణి దంపతుల ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పరదేశమ్మ ఆలయానికి బెంచీలు వితరణ


ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీ

రోలుగుంట, ఫిబ్రవరి 24 : కొమరవోలులోని పరదేశమ్మ ఆలయం ఆవరణలో భక్తుల సౌకర్యార్థం ఓ దాత సిమెంటు బెంచీలను ఏర్పాటు చేశారు. బుచ్చెంపేట గ్రామానికి చెందిన అనిమిరెడ్డి రమణ తన సొంత నిధులతో వీటిని సమకూరడంతో శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు ఇటంశెట్టి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీటీ ఆనందరావుకు మాడుగుల బదిలీ



గొలుగొండ, ఫిబ్రవరి 24 : ఇక్కడి డిప్యూటీ తహసీల్దార్ గోరా ఆనందరావు మాడుగుల మండలానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి శనివారం ఆదేశాలందాయి. ఐదేళ్లుగా ఆయన ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బదిలీ జరిగినట్టు సిబ్బంది తెలిపారు.

బీఎస్పీ మ్యానిఫెస్టో విడుదల


మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న బీఎస్పీ నాయకులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 24 : నియోజవర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని మ్యానిఫెస్టోను విడుదల చేసినట్టు బీఎస్పీ ఇన్‌చార్జి బొట్టా నాగరాజు తెలిపారు. బహుజన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం ఇక్కడ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం మునిసిపాలిటీతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అప్పలనాయుడు, నూకరాజు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చేపలు అక్రమ పెంపకందార్లపై ఫిర్యాదు

దేవరాపల్లి, ఫిబ్రవరి 24 : మండలంలో అక్రమంగా చేపలు పెంచుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న జిల్లా ఎస్పీకి శనివారం ఫిర్యాదు చేశారు. అనంతరం సదరు కాపీని విలేకరులకు అందజేశారు. మండలంలోని ములకలాపల్లి, కొత్తపెంట, మామిడిపల్లి, తారువ, కలిగొట్ల, చేనులపాలెం, మారేపల్లి, దేవరాపల్లి తదితర గ్రామాల్లో చేపల పెంపకందార్లు నిబంధలకు విరుద్ధంగా చేపలు పెంచుతున్నారని ఆరోపించారు.

నాగయ్యపేటలో ప్రత్యేక పూజలు

దేవరాపల్లి, ఫిబ్రవరి 24 : మాఘ పౌర్ణమి సందర్భంగా నాగయ్యపేటలోని జామి పెదరాము ఇంటి వద్ద శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదరాము ఆధ్వర్యంలో గ్రామంలో అన్నసమారాధన ఏర్పాటైంది. కోలాటం వేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సంఖ్యలో పాల్గొన్నారు.

'నేత కార్మికులకు పింఛన్ల మంజూరులో వివక్ష'

రావికమతం, ఫిబ్రవరి 25 : యాభై సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులంతా ఆయా గ్రామాలలోని సచివాలయాల్లో పింఛన్ కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మాడెం సూరి అప్పారావు కోరారు. శనివారం ఇక్కడ నిర్వహించిన చేనేత కార్మిక సంఘం మండల సమావేశంలో మాట్లాడారు. యాభై సంవత్సరాలు నిండిన అర్హులందరికీ అధికారులు పింఛన్ మంజూరు చేయాల్సిందిగా ఆయన కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి దొడ్డి సురేష్, పప్పు వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ అర్హులకు పింఛన్ల మంజూరులో వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. మండలంలోని చేనేత కార్మికులు పాల్గొన్నారు.

వైసీపీలో ముసలం

... 5వ పేజీ తరువాయి

దోపిడీ చేస్తున్నారని, గోవాడ షుగర్స్‌లో కూడా వారి అవినీతి ఎక్కువైందని ఆరోపణలు గుప్పించారు. ఆయనకు మళ్లీ సీటు ఇస్తే పార్టీ ఓడిపోవడం ఖాయమని ఆ ఫిర్యాదులో విజ్ఞప్తి చేయడంతో పాటు వేరే వ్యక్తిని ఇన్‌చార్జిగా నియమించాలంటూ సూచించారు. కాగా ఈ వ్యతిరేక ప్రచారాన్ని ధర్మశ్రీ వర్గీయులు కొట్టిపడేస్తున్నారు. తమ నేతకు సీటు రాకుండా చేసేందుకు తెర వెనుక కొన్ని శక్తులు పని చేస్తున్నాయని, ఎవరెంత చేసినా ఈసారి సీటు ధర్మశ్రీకే ఖాయం అవుతుందంటూ వాదిస్తున్నారు.

నిర్లక్ష్యం తాండవం

... 5వ పేజీ తరువాయి

లేదు. తాండవ రిజర్వాయర్‌లో నీటిమట్టం తెలిపే పెయింటింగ్ పూర్తిగా పోవడంతో ఎన్ని అడుగుల నీటి నిల్వలు ఉన్నాయో తెలుసుకోవడం కష్టంగా ఉందని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. సుందరీకరణలో భాగంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో డ్యామ్‌పై కడియం నుంచి తెచ్చిన వివిధ రకాల పూల మొక్కలను ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మొక్కలు ఎండిపోయాయి. డ్యామ్‌పై విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో అంధకారంగా ఉంటోంది. డ్యామ్ దిగువన గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసిన పార్కు ఇప్పుడు అధ్వానంగా తయారైంది. కాగా ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని, రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల్లో పూడికలు తొలగించాలని, డ్యామ్‌పై అభివృద్ధి పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.